# కిచెన్ గార్డెన్

'రాజశ్రీ'



మహిళా మండలి కార్యక్రమాలన్నా వనితావాణి కార్యక్రమాలన్నా మా శ్రీమతికి అదో పిచ్చి. ఎన్ని యితర కార్యక్రమాలున్నా, యీ రెంటి తరువాతనే,

అనామిక

ఇంట్లో యెంత అవసరమైన పనులు మూలుగుతున్నా వాటి మానాన వాటిని వదిలేస్తుంది. అదేమిటంటే "యివి యెప్పుడూ ఉండేవిగదా ! కాస్త నలుగురితో హాయిగా గడపనివ్వండి. రోజల్లా వంటింటి కుందేలునేగా" అంటూ వాళ్ళకార్యదర్శి కార్యక్రమాలన్నీ కుమ్మరిస్తుంది. పిల్లలు యెంత యేడ్చినా, గీ పెట్టి అరిచినా, తన కేమి పట్టనట్లుగా మహిళా మండలికి ప్రయాణమౌతుంది. ఛార్జి నాకిచ్చేరే. ఇది కూడా వాళ్ళ తీర్మానాలలో ఒకటేమో ! యింటి పట్టునుండి పిల్లల బాగోగులు పట్టించుకోవటానికి తిలోదకాలు. ఆఫీసునుంచి వచ్చిన శ్రీవారికి అప్పజెప్పి కాస్తంత హాయిగా తిరిగి వస్తుంటారు. మరి స్త్రీ సమానత్వం కోరుతున్నది గదా !

పట్టణపు పోకడలు అలవాటు పడ్డాఘేమో. బాగా సింగారించుకొని అందంగా కనబడాలనే ఆతురత యీ మధ్యనే ఎక్కువైంది. తగ్గట్టుగా కుట్టు వెధవల అల్లరులు. పాపం యీ పసివాళ్ళకు సమయా సమయాలు తెలియవసలు. లిప్ మూవ్‌మెంట్‌కు యెంత కష్టపడుతున్నారో! ఆవిడ చీర తీయటము మొదలు వీళ్ళ ఏడుపులు – ఎంత తీరిగ్గా తయారౌతా ననుకుందో అంత త్వరలో కొంచెం పవుడరు పులుముకొని అడ్డనట్టుగా తిలకము పెట్టుకుని మాచింగ్ దుస్తులే ధరించి, యీ 'నరకము' నుంచి బయటపడుతుంది.

శ్రీమతి లాంటి సభ్యులుంటే కార్యక్రమాలన్నీ ఘనవిజయం సాధించుతాయి. ఆ మధ్య మండలి కార్యక్రమాలలో పొదుపు కార్యక్రమాలను నిర్వహించి కొన్ని సభలు జరిపారు. ఒకానొక సభలో కిచెన్ గార్డెను, దాని ఉపయోగాలు బాగా నచ్చేట్లు జెప్పారేమో, మా శ్రీమతికి యెంతో ఆనందంగా వుండింది తను జెపితే వినవలసిన వాటినే కాబట్టి యీ చెవిన విని ఆ చెవిన వదిలేశా. ఇంతవరకు కొస్తుందనుకొంటే అప్పుడే జాగ్రత్త పడేవాడిని.

అసలింతకీ జరిగిం దేమిటంటే, ఒక రోజున మా పొరుగింటి రాజి వచ్చి మేడ మీద కిచెన్ గార్డెనుకు యేర్పాట్లు చేస్తే బాగుంటుందని శ్రీమతికి సలహా యిచ్చినట్లు చూచాయగా తెలిసింది. నే నంతగా ప్రోత్సహించలేదు. ఎంచేతనంటే విత్తులు నాటినప్పటినుంచి కాయలు కాచేంతవరకు (ఎక్స్ట్రా డ్యూటీ) చాకిరీ చేయలి. ఈ కారణంవలన నేను యీ ప్రపోజల్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎట్లా పసిగట్టిందో చెట్లపనితనే జేస్తానని, నన్ను సహకరించమని కోరింది. నన్ను శ్రీమతి సహకారము అడగడమంటే క్రొత్తే, సమానహక్కుల కోసం పోరాడే యీ మహిళ సహకారము కోరిందంటే, యేదో కొంపమునిగిందన్న మాటే. అందువల్ల బెరుకుగా ఉన్న, శ్రీమతి అంత అర్థిస్తున్నదని కొంత మెత్తబడి "చూద్దాంలే" అన్నమాట గూడా నిజమే.

సహనము పరీక్షలో శ్రీమతికి ఓటమే. ఒక వారం రోజులు ఓపిక పట్టినతరవాత సహనం నశించింది. అది తీవ్రరూపం దాల్చింది. మర్నాటి నుంచి నాకు ప్రత్యేకంగా వంట జేసింది. నేను తెచ్చిన కూరగాయలలో పనికిమాలినవి నాకువంటి

పెట్టేది. ఇట్లా ఉన్నవేమని అడిగితే "బజారు కూరలు డబ్బు వృథాగాని బాగుంటాయా యేం" అని విదిలించిపారే సేది. కాని నేను చాలా జాగ్రత్తగా యేరి తీసుకొచ్చిన విషయం నాకు తెలుసు. అందువల్ల యిది ఒక సత్యాగ్రహం అనుకుని ఊరుకున్నాను. పైకి మాత్రం యేమీ తెలియనివాడిలా అమాయకంగా ఉన్న ముదురు కూరలు తింటూ అరిగి అరగక అవస్థపడుతూ సత్యాగ్రహాన్ని యెదుర్కొన్నాను.

ఈ పథకం పారకపోవటంతో శ్రీమతికి యేమీ పాలుపోలేదు. రెండో అంకం ప్రారంభించిందావిడ. ఎప్పుడూ నవ్వుతూ కవ్వించే శ్రీమతి (ముదురు కూరలు వండిన రోజుల్లో కూడా) యెంతకీ పట్టువదలని యీ విక్రమార్కుడి మొండితనానికి మారుగా మూతిముడుచు కూర్చోటం మొదలు పెట్టింది.అది గూడా చాలా తొందర్లోనే తెలిపోయింది. రెండో పదతిని గూడా ఓటమి కలిగేటప్పటికి శ్రీమతి గారికి పట్టుదలెక్కువై తన సత్యాగ్రహాన్ని ఆందోళనగా మార్చింది కనీసం నేను ఆఫీసు పేపర్లు చూచుకునేటప్పుడు గాని, యితర స్నేహితులతో మాట్లాడు తున్నప్పుడుగాని,పిల్లల అల్లరిని అదుపులో ఉంచి నా పనులకు ఆటంకాన్ని తొలగించేది. ఇప్పుడు మొత్తాన్ని నా నెత్తిపైకి తోలేయటము మొదలెట్టింది. వాళ్ళు విధిలేక నా ప్రాణం తీసేవారు. ఎన్నడూ ఆశ్చర్యపోని వేణునా శ్రీమతిలో మార్పుకు ఆశ్చర్యపోయినాడు. ఇదంతా యెందుకే వీళ్ళందరితో అరవటానికి యింత బలము యెక్కడిదే అంటే, నే తెచ్చిన కూరగాయలు తిన్నందు వలన సంక్రమించిందని మూతిముడు వంకరలు త్రిప్పి యింట్లో దూరిపోయేది. అందువల్ల స్నేహితుడ్ని యింటికి రావద్దని ఆఫీసుపని పూర్తిగా అయిపోయిం తరువాతే యింటికి వచ్చేవాడిని, తరవాత పిల్లలతో సరదాగా గడిపేవాడిని,ఇంతలో ఆఫీసులో ఒక ఫ్యాన్‌ని నాకివ్వటంతో పిల్లలకు అప్పుడప్పుడు గార్డెన్‌కు వెళ్ళే అదృష్టం పట్టేది.

నన్ను నేనే యెంతగానో మెచ్చుకున్నా శ్రీమతి పెడుతున్న పరీక్ష లన్నింటిలో కాపీ కొట్టకుండా పాస్ అవుతున్నందుకు. కాని ఉన్నట్లుండి ఒక రోజు సాయంకాలానికల్లా మా యింటి ముందు మట్టి, యెరువు గుట్టలుగా పడేసి ఉండటము, దాని చుట్టూరా పిల్లలు – సాక్షాత్కరించారు. కొంపదీసి ప్రత్యక్ష చర్య కాదుగదా అనుకుంటూ ఇంట్లో అడుగుపెట్టటం తోటే శ్రీమతి చింపిరి జుట్టు, ఒక తట్టతో మొహమంతా పులుముకున్న నవ్వుతో స్వాగతం పలికింది. మట్టితోడి లోపల పోస్తున్నదేమో ఒంటినిండా మట్టయింది. ఆ రోజున శ్రీమతిలో నేను జూచిన ఆనందము, విజయ చిహ్నాలు, నే నింతవరకు మరి జూడలేదు. మహిళా మండలికి వెళ్ళుతున్నప్పుడుకూడా ఇంత నిండు గా తృప్తిగా కనబడలేదు. "పోనీలే" అనుకుంటూండగా బిలబిలమంటూ పిల్లలు అమ్మ దగ్గర తట్ట లాక్కొని మట్టినింపి కేకవేశారు.

పెద్దా చిన్నా అంతా పనిజేశారు.మట్టి,

ఎరువు మేడమీదకి జేర్చేప్పటికి సాయంత్రం ఏడు దాటింది. చుట్టూ చెక్కలు పెట్టి, మట్టి తడిపి ప్లాటు జేసేప్పటికి ఇంకో అరగంట పట్టింది. అంతవరకు శ్రీమతి వంట మొదలు పెట్టలేదు. పనులై తేచేశారుగాని పిల్లలు ఆకలికి ఆగలేకపోయారు. ఆకలి అంటూ అంతా వేధించసాగారు. శ్రీమతికి విసుగు యెక్కువ. "ఒళ్ళంతా మట్టికొట్టుకుంది. తలనిండా మట్టి-తలంట్లు పోసుకుందాం. ఇందాకేదాయిలెర్ అంటించా" సంటూ ఆకలిని వాయిదావేసింది. సరేనంటూ నాలుగు బిస్కెట్లు నిచ్చాను. అది తిని నీళ్ళుతాగి కొంత ఊరడిల్లారు. కాని కోరస్ పల్లవిలాగా అదేపదము యెత్తుకున్నారు. శ్రీమతి నాలుగు అక్షింతలు విసిరింది. వాళ్ళనే కాకుండా నన్నుకూడా మందలించింది. "అట్లా జూస్తూండక పోతే వాళ్ళకు సర్ది జెప్పరాదూ" అంటూ. కిక్కురు మనకుండా వాళ్ళని పిలుచుకున్నాను. పక్కగదిలో పాటలు పాడుకుంటూ కూర్చున్నాము.

విసురుగా వచ్చిన శ్రీమతి వాళ్ళ నెత్తిన యింత నూనె పట్టించింది. అది శాస్త్రమట. నూనె లేకుండా తలస్నానము జేయరాదుట. తలమీదుండే కొబ్బరి నూనె సరిపోదుట.

వంతుల ప్రకారము స్నానంమొదలు. అందరినీ వరసన కూర్చోబెట్టి ఒకళ్ళ తరవాత యింకొకరికి స్నానము చేయించాలని ఆవిడగారి సంకల్పము. విసిగి ఉందో, అలసిపోయిందో, కుంకుడు రసము సరిగా పోసే ఓపిక కూడా లేకపోయింది. పెద్దలావాడికళ్ళల్లోకుంకుడురసం బడింది. "అమ్మో" అంటూ గావుకేక పెట్టాడు. ఏమైందోనని బాత్‌రూం వైపు వెళ్ళాను. చూడండి వాడి అల్లరి. అసలు సయేమీ కాలేదు. అదుస్తున్నాడు" అంది.

"అంతా అసత్యం కళ్ళలో రసము పడింది" అంటూ ఏడుపు స్థాయిపెంచాడు నాకెందుకులే అని వచ్చిన దోవబట్టాను. ఇంతలోనే "అర్జెంట్" పిలుపుతో మళ్ళీ వెళ్ళక తప్పలేదు. "మీరే వాళ్ళకు స్నానము చేయించండి" అని గిన్నె అక్కడ పడేసింది" ఏమంటీ శ్రీమతి గారూ, దీనికంతకే కారణము నేనే నంటారా" అన్నాను. ఇదే నా అపరాధము దీని కోసమని తర్వాత్యున్ముఖుడునయ్యాను.

శ్రీమతిగారి సహాయము లేనిదే యిటువంటి పనిజేయ నిస్సహాయుడ నగుట వలన ఆమె సహాయం కోరాను. మహారాణీగారు కోపంగానే ఉండి, అంగీకార ముద్ర వేశారు. చావు తప్పి కన్నులొట్ట పోయినట్లు యిద్దరికి స్నానాలు జేయించేప్పటికే నాపని పూర్తయింది. అప్పటికీ ఓపిక పట్టుదామనుకుంటే కొంటెపిల్ల సహాన "నాన్నొద్దు. నువ్వే" నంటూ అమ్మను చుట్టేసింది. బ్రతుకు జీవుడా అని బయట పడదామంటే శ్రీమతిగారు యింకో పని అప్పజెప్పారు. కుంపట్లు మీది పదార్థాలు ఉడికితే కారము, ఉప్పు వేసి దించమన్నారు. సరే, బాత్రూం నుంచి వంటింటికి ట్రాన్స్‌ఫర్. నా చేతి వంట అందరికీ అనుభవమే. అయినా అడపా దడపా ఆపని జేస్తూనే. ఉంటాను.

కారము, ఉప్పుతెచ్చి పెట్టుకొని మూతలు తీసి ఉడుకు పెట్టినయ్యేమో

చూసాను. తగు మాత్రం పాళ్ళలో వాటిని కలుపబోయే సమయానికి లైట్లు ఆరి పోయినై. ఎట్టకేలకు ఉప్పుకారము కలి పాగాని, మెంటులో యేది కలిపింది అంతగా గుర్తులేదు. ఇంతలో లైట్లు వచ్చినయి. కొంత సేపటికి వాటినిదించా.

సహాన తల స్నానానంతరము వరి సలో తను. నాదికూడా అయిందనిపించు కొందామంటె శ్రీమతి తను స్నానానికె బయలు దేరింది. స్నానాల గది మూసి యేదో కొంప మునిగి నట్లు కేకేసింది. ఆదరా బాదరాగా నేను వెళ్ళితే అందులో నుంచే "కొంపతీసి కుంకుడుకాయ రసము పోయటానికి పిలిచాననుకున్నారేమో – ఎంతకీ పలకకపోతే గట్టిగా పిలిచా.... కొంచెం పిల్లలకి చద్దెన్నం పెట్టండి" అంది. వేడినీళ్ళ చప్పుడు, శ్రీమతి ఉదాసీనతకి కారణము తెలిపింది.

"రేపు ప్రొద్దున విత్తనాలు చల్లాలి" అంటూ వంటింట్లోకి ఒళ్ళు తుడుచు కుంటూనే ప్రవేశించింది.

"ఊఁ" అన్నా.

"ఆరు గంటలకే లేవండి. లేకపోతే పని తెమలదు."

"అట్లాగే"

"వాళ్ళకి పక్కలేసి వస్తాను. మీరు పదండి" అంది. వాళ్ళ భోజనానంతరం నేను స్నానాల గదిలోకి ప్రవేశించాను. రాముడు మంచి పిల్లవాడులాగా. విజయ పతాకాన్ని యెగరవేస్తూ శ్రీమతి ప్రవే శించి, ఓడిపోయిన కొండిదేటును సాను భూతితో చూచినట్లు నన్ను చూస్తూనే నా తల స్నానం ముగించింది.

తల తుడుచుకుంటూ "మొత్తానికి సాధించావు" అన్నా.

"చిన్న విషయమే గదండీ– ఏ పూట కా పూట తాజా కూరలు వండుకోవచ్చు. మందులు మాకులతో పెంచిన కూర గాయలు రుచిపచి లేకుండా ఉంటున్నా యంది.

"రేపటి నుంచీ నాకేనా ఆ పనంతా"

లేదండీ – రాములు జేస్తాడు"

"ఇంతేనా" అన్నా.

"మీరు చాలా మంచివారు...భోజ నానికి లేవండి" అంది.

భోజనం ముందు కూర్చున్నాం. అన్నమంతా యెఱ్ఱగా ఉంది.

"బియ్యం మంచివి కావా" అన్నా.

"రోజూ వండే బియ్యమేగా" అంది. తను పరిశీలించి నవ్వాపుకోలేకపోయింది. "రుచి చూడండి" అంది.

"అబ్బ ! కారం"

"కూరో"

"ఉప్పుకషాయం" అన్నాను

"పాపం. మీ వంటను తీరికగా ఆర గించండి."

"కాస్త పెరుగు చాలు." అంటూ యెంతో ప్రాధేయపడితే ఆ విద గారు అంగీకరించారు. ఇద్దరం పెరుగు అన్నం తోనే సరిపుచ్చుకున్నాం. శ్రమ ఫలితం యింతేనేమోనని.

బెడ్రూంకి వచ్చిన శ్రీమతి జారు ముడితో ప్రత్యక్షమైంది. స్నానముజేసిన మీదట హరించిపోయిన అలసట ఆవి డకు మరింత సంతోషాన్ని కలుగజేసింది అందులో నా ఓటమి ఆవిడకు ప్రధా నము. నేను నిద్రపోవడానికి ప్రయత్ని స్తుంటే "ఏమండీ 5–30కి అలారం పెట్టాను. నన్ను లేపండి. మరిచిపోకండి అంటూ జణగణమన చెప్పింది.



అనామిక